క్లుప్తంగా

అంగన్‌వాడీల సమస్యలపై వినతిపత్రం

పోలవరం రూరల్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోలవరం తహసీల్దార్ బి.సుమతికి అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు వినతిపత్రం సమర్పించారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.భారతి, ప్రాజెక్టు కార్యదర్శి పీఎల్ఎస్ కుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలన్నారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. సీనియారిటీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, సూపర్‌వైజర్ పోస్టుల్లో వయో పరిమితి తొలగించాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లకు వయో పరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని తదితర డిమాండ్‌లతో వినతిపత్రం అందజేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెం సచివాలయ పరిధిలో దిబ్బగూడెంలో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితురాలు రాములమ్మకు మంగళవారం బుట్టాయగూడెం మండలం దొరమామిడికి చెందిన ఫ్రెండ్స్ ఫర్ హెల్ప్ గ్రూప్ సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. జెడ్పీటీసీ మల్లం వసంతరావు, మాజీ సర్పంచ్ పైదా వెంకటేశ్వరరావుతో పాటు ఆ సంస్థ ప్రతినిధులు మడకం సురేష్, పఠాన్ వల్లీ ఖాన్ చేతుల మీదుగా రూ.1,500 నగదు, 25 కేజీల బియ్యం, దుప్పట్లు, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రూప్ ప్రతినిధులు కంచెర్ల నవీన్, షేక్ సయ్యద్, పొన్నాటి మంగారావు పాల్గొన్నారు. అగ్నిప్రమాద బాధితురాలికి జీలుగుమిల్లి పాత్రికేయుల బృందం 50 కేజీల బియ్యం, కూరగాయలు, దుస్తులు అందజేశారు. ఈ సరుకులను గిరిజన సంఘం నాయకులు తెల్లం దుర్గారావు బాధితురాలికి అందజేశారు.

యర్రంపల్లిలో అగ్ని ప్రమాదం

చింతలపూడి: చింతలపూడి మండలం, యర్రంపల్లిలో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. గ్రామానికి చెందిన తగరం దేవసహాయంకు చెందిన తాటాకిల్లు అగ్నికి ఆహుతి అయ్యింది. ఈ ఘటనలో సుమారు రూ.6 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈలోగా ఇంట్లో ఉన్న సామగ్రితో సహా రూ.1.75 లక్షల కరెన్సీ కాలిపోయిందని బాధితులు చెప్పారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్లు అధికారులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఏఎంసీ చైర్ పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి అధికారులతో మాట్లాడి బాధితుడికి న్యాయం చేయాలని కోరారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ బహూకరణ

జంగారెడ్డిగూడెం: స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు సురక్షిత తాగునీటి సమస్య తీరింది. మంగళవారం జంగారెడ్డిగూడెం పట్టణానికి విచ్చేసిన అవంతి ఫీడ్స్ అధినేత అల్లూరి ఇంద్రకుమార్ స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. విద్యార్థులకు సురక్షిత మంచినీటి ఆవశ్యకతను తెలుసుకున్న ఇంద్రకుమార్, తన మాతృమూర్తి సుభద్ర జ్ఞాపకార్థం కళాశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ఇంద్రకుమార్ దాతృత్వంతో కళాశాలకు ఆర్వో వాటర్ ప్లాంట్ సమకూరిందన్నారు. ఈ సందర్భంగా ఇంద్రకుమార్‌కు విద్యార్థులతో కలిసి ధన్యవాదాలు తెలిపారు. స్పందించిన ఇంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రాథమిక అవసరాలు తీర్చడంలో తాను భాగస్వామినైనందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి ఇంద్రకుమార్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు సత్కరించారు.

80మందికి వైద్యపరీక్షలు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన పందిరిమామిడిగూడెంలో తాడేపల్లిగూడెంకు చెందిన ఆత్మబంధువు సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ పాఠశాల వద్ద ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుంకేశుల సందీప్ కుమార్, డాక్టర్ నిహారిక సుమారు 80 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు కడియాల పరశురామయ్య, ఉపాధ్యక్షుడు టి. సూరిబాబు, అంతర్వేదిగూడెం సర్పంచ్ జోడే సత్యదుర్గాప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థులకు నూతన వస్త్రాలు, వృద్ధులకు దుప్పట్లు, రగ్గులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కడియాల పరశురామయ్య మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గిరిజన ప్రాంతంలోని 90 మంది పేద గిరిజన విద్యార్థులకు, వృద్ధులకు తమ సంస్థ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలను పంపిణీ చేశామని అన్నారు. తానిగూడెం, మోతుగూడెం, సిరివాక, చీడూరు, కొరుటూరు, బూరుగువాడ, తదితర గ్రామాల్లోని చిన్నారులకు నూతన వస్త్రాలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ జనరల్ సెక్రటరీ సీతాల ఉషాకిరణ్, ట్రెజరర్ కె. వెంకటాచలం, ప్రతినిధులు బక్కా వెంకటేశ్వరరావు, దూలం నాగరాజు, కె.బాబు, గంగాధర్ రెడ్డి, పెద్దిరెడ్డి మూర్తి, ప్రధానోపాధ్యాయులు జలగం రాంబాబు, గ్రామ పెద్దలు బొల్లి విశ్వనాథరెడ్డి, కెచ్చెల రామిరెడ్డి, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో రాష్ట్రం పురోభివృద్ధి

- ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- యర్రంపేటలో 'గడపగడపకు'

కొయ్యలగూడెం: సంక్షేమ ఫలాలతో లబ్ధి పొందుతున్న రాష్ట్ర ప్రజలు పురోభివృద్ధి దిశలో పయనిస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. మంగళవారం యర్రంపేటలో ఎల్‌ఏసీఎస్ అధ్యక్షురాలు విగ్గిన వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో-1 అన్ని పార్టీలకు వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు గాలికి వదిలివేసిన చంద్రబాబు నాయుడు అధికారమే పరమావధిగా శవరాజకీయం చేస్తున్నాడని తెలిపారు. ప్రజలందరూ సంక్షేమ సారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంజిమాల రామారావు, ఎంపీటీసీ నారా అన్నపూర్ణాదేవి, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు విగ్గిన రామకృష్ణ, కంఠమణి సుబ్బారాయుడు, జి.సురేష్, ఉస్సే బాబూరావు, పి.బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పథకాలు అమలు

జంగారెడ్డిగూడెం: ప్రతీ ఒక్కరు ఆర్థిక ఉన్నతిని సాధించాలనే లక్ష్యంతో పథకాలను సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని 27వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా మాట్లాడుతూ సంక్షేమంతో పాటు ఆర్థిక పరిపుష్టి కూడా ముఖ్యమని భావించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రతీవ్యక్తి ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెట్టి ప్రతి ఒక్కరికీ సహాయాన్ని అందిస్తున్నారన్నారు. మహిళలు, రైతులు, చిరువ్యాపారస్తులు, ఇలా అన్ని వర్గాల ప్రజలకు ఏదో ఒక పథకం ద్వారా భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతీ గడపకు నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లిన ఎమ్మెల్యే ఎలీజా ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, వారికి అందుతున్న తీరు, ఆయా పథకాల వల్ల వారికి కలిగిన లబ్ధిని తెలుసుకోవడంతో పాటు వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల తెలిపిన సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రజలు వైఎస్సార్ సీపీ పాలన పట్ల పూర్తిస్థాయి సంతృప్తితో ఉన్నారని, వెళ్లిన ప్రతి గడపలోనూ ప్రజలు ప్రభుత్వం, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల సానుకూల దృక్పథంతో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి, పట్టణ అధ్యక్షులు పీపీఎస్ చంద్రరావు, మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, స్థానిక కౌన్సిలర్ నేట్రు సుబ్బలక్ష్మి, కౌన్సిలర్లు చిటికెల అచ్యుతరామయ్య, ఎల్‌వీఆర్ తడికిమల్ల మురళి, డి.ధనలక్ష్మి, అయినాల వెంకటరమణమూర్తి, సొసైటీ డైరెక్టర్ చిప్పాడ వెంకన్న, వైసీపీ సీనియర్ నాయకులు బత్తిని చిన్న, గెద్దాడ శీను, చింత అనిల్ కుమార్ గౌడ్, నేట్రు గణేష్, షేక్ అమీర్, తల్లాడ సంజయ్, గంజి వినోద్, డి.రాజేష్, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెం మండలం యర్రంపేటలో పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



జంగారెడ్డిగూడెంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలు, అమలు తీరును వివరిస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

నేడు కుకునూరులో పర్యటించనున్న బాలరాజు

కుకునూరు: నేడు పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కుకునూరులో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నూతన పింఛన్ల పంపిణీ, నిర్వాసితులకు భూమి పట్టాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు లింగపాలెంలో ఉపాధి హామీ ప్రజావేదిక

లింగపాలెం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లింగపాలెం మండల సామాజిక తనిఖీ గ్రామ సభ బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్ ఆశీర్వాదం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ సభ నిర్వహిస్తామన్నారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 2020 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 వరకు జరిగిన పనులను సభలో ప్రజలకు చదివి వినిపిస్తామన్నారు. ఈప్రజావేదికకు ప్రజలు తప్పక హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

నిర్వాసితుల నుంచి వినతులు స్వీకరించిన ఆర్డీవో

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన గ్రామాల్లో నష్టపరిహారం అందని నిర్వాసితుల నుంచి జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి వినతులు స్వీకరించారు. పోలవరం రెవెన్యూ కార్యాలయంలో ఆమె మంగళవారం ప్యాకేజీ అందని 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకుల నుంచి వారి వివరాలను సేకరించారు. చెట్ల నష్టపరిహారం, పాత ఇంటి విలువలు తదితర నష్టపరిహారాలు అందని నిర్వాసితులు కూడా తన సమస్యలను విన్నవించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ బి.సుమతి పాల్గొన్నారు.

చింతలపూడి ప్రత్యేకాధికారిగా ఆదర్శ రాజేంద్ర

చింతలపూడి: చింతలపూడి నగర పంచాయతీ ప్రత్యేకాధికారిగా నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్ర నియమితులయ్యారు. ఈమేరకు నియామక ఉత్తర్వులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి జారీ చేశారు. గతంలో ప్రత్యేకాధికారిగా ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యదర్శి నియమించారు. ప్రస్తుతం మున్సిపల్ శాఖ అభ్యర్థన మేరకు పరిపాలన సౌలభ్యం కోసం ఆదర్శ రాజేంద్రను నియమించారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

కొయ్యలగూడెం: సంక్రాంతి సంబరాలు మతాలకు అతీతంగా నిర్వహిస్తూ ప్రజలు మత సామరస్యంతో గడుపుతున్నారని ఎస్సై జీజే విష్ణువర్ధన్ పేర్కొన్నారు. కొయ్యలగూడెం వాటర్ ట్యాంక్ రామాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నేత నూకాల రాము రూ.25వేల సౌజన్యంతో ముగ్గుల పోటీ నిర్వహించారు. మంగళవారం సాయంత్రం నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవానికి డాక్టర్ కొండముది దిలీప్‌కుమార్‌తో కలిసి ఎస్సై విష్ణువర్ధన్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 75 మంది మహిళలు సందేశాత్మక, ఆదర్శనీయ, సాంప్రదాయ పద్ధతులతో రంగవల్లులను తీర్చిదిద్దారు. కార్యక్రమానికి సర్పంచ్ ముప్పిడి విజయ్‌కుమార్ అధ్యక్షత వహించి ఐదుగురు విజేతలతో పాటు, రెండు కన్సోలేషన్ బహుమతులు, పాల్గొన్న 75మందికి ప్రోత్సాహక బహుమతులను అతిధుల చేతుల మీదుగా అందించారు. జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ మట్టా వనజా లక్ష్మి, శుక్లబోయిన పండు, సచివాలయ కన్వీనర్ మారిశెట్టి శ్రీను, కత్తవ రాజు, కండెల్లి శివ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రేపల్లెవాడ మేధ పబ్లిక్‌స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు, సంక్రాంతి ముగ్గులు, డూడూ బసవన్న, హరిదాసుల సత్కారం, జంగమ దేవరల దీవెనలు వంటి సంక్రాంతి సాంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించి, బహుమతులను ప్రిన్సిపాల్ నల్లూరి మధు ఆధ్వర్యంలో అతిధుల చేతుల మీదుగా అందింపచేశారు.



కొయ్యలగూడెంలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం



చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

కామవరంలో 12 నుంచి 14వ తేదీ వరకూ ఆటల పోటీలు

బుట్టాయగూడెం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని మారుమూల గ్రామమైన కామవరంలో ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకూ ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు గిఫ్ట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పెద్దిరెడ్డి మూర్తి తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కామవరంలో గిరిజన యువకుల ఆధ్వర్యంలో ఐదేళ్లుగా సంక్రాంతి పండగను పురస్కరించుకుని సంప్రదాయ ఆటల పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

చింతలపూడి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు, భోగి పండ్లు పోయడం, పాలు పొంగించి సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులను సందడి చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మదన్‌మోహన్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గాలిపటాలు, ముగ్గుల పోటీలు, మ్యూజిక్ ఛైర్స్, నృత్యాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జి. శ్రీనివాస్, బి.సరస్వతి పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత కిచ్చప్పగూడెం

కొయ్యలగూడెం: జాతీయస్థాయి వాలీబాల్ క్రీడాకారులను అందించగల సత్తా పోలవరం నియోజకవర్గంలో ఉందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాలు నేపథ్యంలో కొయ్యలగూడెం ప్రభుత్వ బాలుర హైస్కూల్లో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మంగళవారం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బాలరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్సై జీజే విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహించారు. మంగళవారం ఫైనల్ మ్యాచ్‌లో కొయ్యలగూడెం జట్టుపై కిచ్చప్పగూడెం విజయం సాధించింది. మొత్తం 18 జట్లు పోటీలో పాల్గొన్నట్లు ఎస్సై తెలిపారు. విజేతగా నిలిచిన కిచ్చప్పగూడెం జట్టుకు రూ. 12వేలు నగదు, మెమొంటోను, రన్నర్స్‌గా నిలిచిన కొయ్యలగూడెంకు చెందిన వెంకటపతిరాజు ఎడ్యుకేషనల్ సొసైటీ జట్టుకు రూ. 6వేలు నగదు, షీల్డ్‌ను బహూకరించారు. సీఐ కె.విజయ్‌కుమార్, ఎంపీపీ గంజిమాల రామారావు, వైసీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, పట్టణ కన్వీనర్ సంకు కొండ పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

కామవరపుకోట: క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని జంగారెడ్డిగూడెం సీఐ బాలసురేష్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక వీరభద్ర స్వామి ఆలయ ఆలయ వద్ద తడికలపూడి పోలీస్ స్టేషన్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న వాలీబాల్ పోటీలను బుధవారం సీఐ ప్రారంభించారు. క్రీడా పోటీలను నిర్వహిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు మాను కొండ సుబ్బారావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డీవీ సత్యనారాయణ, తడికలపూడి ఎస్సై కె.వెంకన్న, మానవత చైర్మన్ ఎం రమేష్ బాబు, కామవరపుకోడ సొసైటీ చైర్మన్ సాయిని కనకరాజు పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో కిచ్చప్పగూడెం జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

సస్యరక్షణ చర్యలతో మామిడిలో అధిక దిగుబడి

చింతలపూడి: సస్యరక్షణ చర్యల ద్వారా మామిడిలో అధిక దిగుబడులను సాధించవచ్చునని ఉద్యానాధికారి అమర్‌నాథ్ రైతులకు సూచించారు. తోటబడి కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాగిరెడ్డిగూడెంలో మామిడితోటలను ఉద్యానాధికారులు పరిశీలించి రైతులకు సాగుకు అవసరమైన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఉద్యానశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పారిజాతగిరిలో వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామిని అవంతి ఫీడ్స్ గ్రూప్ అధినేత అల్లూరి ఇంద్రకుమార్ మంగళవారం దర్శించుకున్నారు. ప్రతి మంగళవారం ఆలయంలో నిర్వహించే బంగారు పుష్పాల పూజలో పాల్గొని, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంద్రకుమార్‌కు ఆలయ ఈవో మానికల రాంబాబు, అభివృద్ధి కమిటీ సభ్యులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం స్వామి వారి శేషవస్త్రాలతో ఆయనను సత్కరించి, వేదాశీర్వాదం, ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు

పారిజాతగిరి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారిని విశేషంగా అలంకరించి బంగారు పుష్పాలతో అర్చన చేశారు.

నేడు పారిజాతగిరిలో కూడారై మహోత్సవం

జంగారెడ్డిగూడెం: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం పారిజాతగిరి ఆలయంలో కూడారై మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మానికల రాంబాబు, ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు మంగళవారం తెలిపారు. 11వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు ధనుర్మాస కార్యక్రమంలో భాగంగా కూడారై మహోత్సవం, ప్రసాద నివేదన జరుగుతుందని తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

యువత కోసం సంప్రదాయ క్రీడాపోటీలు



పోలవరంలో నిర్వహించిన క్రీడలను తిలకిస్తున్న డీఎస్పీ కె.లతాకుమారి

పోలవరం రూరల్: సంక్రాంతి పండుగ సమయంలో యువత చెడు వ్యసనాల బారిన పడకుండా సంప్రదాయ క్రీడలను నిర్వహిస్తున్నట్లు పోలవరం డీఎస్పీ కె.లతాకుమారి అన్నారు. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యువకులకు క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండుగలను కుటుంబసభ్యులతో కలిసి ఉత్సాహంగా నిర్వహించుకోవాలన్నారు. కోడిపందేలు, జూదాలు వంటి వాటి జోలికి వెళ్లవద్దని సూచించారు. ఈ సందర్భంగా క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ, సర్పంచ్ పాదం పుష్ప, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు, ఎస్సై ఎస్.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

చింతలపూడి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఏఎంసీ చైర్ పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి అన్నారు. స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడతా యని అన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రావీణ్యం సంపాదించాలన్నారు. క్రీడల్లో రాణించడం ద్వార అత్యున్నత శిఖరాలను చేరుకోవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణజ్యోతి, ఎంపీపీ బాణావతు రాంబాబు, జెడ్పీటీసీ మొలుగుమాటి నీరజా సుధాకర్, ఎంపీడీఓ మణికుమారి, నగర పంచాయతీ కమిషనర్ ఎన్ రాంబాబు, ఎంఈఓ జి రామారావు పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలి

లింగపాలెం: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు చింతలపూడి సీఐ మల్లేశ్వరరావు అన్నారు. ఏలూరు ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ ఆదేశాల మేరకు సోమవారం ధర్మాజీగూడెం పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో లింగపాలెం మండలస్థాయి వాలీబాల్ పోటీలను శింగగూడెం హైస్కూల్లో సీఐ మల్లేశ్వరరావు, తహసీల్దార్ మురళీకృష్ణ ప్రారంభించారు. సీఐ మల్లేశ్వరరావు, తహసీల్దార్ మురళీకృష్ణ మాట్లాడుతూ జూదాలకు యువత దూరంగా ఉండాలని అన్నారు. ఈ పోటీల్లో 10 జట్లు పాల్గొన్నట్లు ఎస్సై పి చెన్నారావు తెలిపారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

జంగారెడ్డిగూడెం రూరల్: సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కె. స్లీవ జోజి తెలిపారు. మంగళవారం మండలంలోని నాగులగూడెం, పేరంపేట, పంగిడిగూడెం, లక్కవరం, టెక్కినవారి గూడెం, అమ్మపాలెం, నిమ్మలగూడెం, కట్టవపాదలవారిగూడెం, తిరుమలాపురం, కేతవరంలో తహసీల్దార్ స్లీవ జోజి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శులు, పోలీసులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులతో గ్రామ సభలు నిర్వహించారు. జనవరి 10,11 తేదీల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో తహసీల్దార్, ఎంపీడీవోలను రెండు వేర్వేరు టీంలుగా నియమించి గ్రామ సభలు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.ఎక్కడైనా కోడి పందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే సచివాలయంలో, స్థానిక పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.



కేతవరం గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ స్లీవ జోజి

తిమ్మాపురంలో కోడిపందేల బరి ధ్వంసం

ద్వారకాతిరుమల: మండలంలోని తిమ్మాపురంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడి పందేల నిర్వహణకు సిద్ధం చేసిన ఒక బరిని మంగళవారం ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్, సిబ్బంది ధ్వంసం చేశారు. ముందుగా బరిని ట్రాక్టర్‌తో దున్నించి, చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు ఏర్పాటు చేసిన స్తంభాలను తొలగించారు. ఆ తరువాత ఆ ప్రాంతంలో హెచ్చరిక ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. సంప్రదాయం పేరుతో కోడి పందేలు, జూదాలను నిర్వహిస్తే చూస్తూ ఊరుకోమని ఎస్సై హెచ్చరించారు. అనంతరం ఆయన పంగిడిగూడెంలో సంక్రాంతి పండుగపై అవగాహన సదస్సు నిర్వహించారు. పండుగ రోజుల్లో యువత కోడి పందేలు, పేకాట, గుండాట వంట అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతూ సంప్రదాయ క్రీడల్లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రత్తిపాటి మహాలక్ష్మడు, పంచాయతీ కార్యదర్శి ఎల్ వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

సోమవరప్పాడులో అత్యవసర సమావేశం

దెందులూరు: సోమవరప్పాడు సచివాలయ పరిధిలో హైకోర్టు ఆదేశాల మేరకు కోడిపందేలు, పేకాట, గుండాట నిర్వహించవద్దని, దీనికి ప్రజలందరూ సహకరించాలని దెందులూరు వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర అన్నారు. మంగళవారం సోమవరప్పాడు గ్రామ సచివాలయంలో సర్పంచ్ సరిగే నాగరాజు అధ్యక్షత కోడిపందేలు, పేకాట నివారణపై అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో వీఆర్ఓ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ పరిధిలో ఎవరైనా కోడి పందేలు, పేకాట ఆడితే గ్రామ, మండల పోలీస్ సిబ్బందికి, వీఆర్వోలకు తెలియజేయాలన్నారు.

కోడికత్తులు తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

బుట్టాయగూడెం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందేల నిర్వహణకు సిద్ధమవుతున్న పందెంరాయుళ్లపై గిరిజన ప్రాంతంలోని పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇప్పటికే పందేల నిర్వహణకు సిద్ధం చేసుకుంటున్న బరులను గుర్తించి స్థలాలు ఇచ్చే వారికి హెచ్చరికలు జారీ చేశారు. పందేలు ఆడేవారిని గుర్తించి బైండోవర్ నమోదు చేస్తున్నారు. బుట్టాయగూడెం మండలంలోని పలు గ్రామాల్లో కోడిపందేల నిర్వహణపై తీసుకునే పోలీస్ చర్యలపై డీఎస్పీ కె. లతాకుమారి, సీఐ బి. వెంకటేశ్వరరావు, ఎస్సై ఎం. జయబాబు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. పండుగ సందర్భంగా కబడ్డీ, వాలీబాల్, ముగ్గుల పోటీలు వంటి సంప్రదాయ క్రీడలను నిర్వహించే విధంగా అవగాహన కలిగిస్తున్నారు. పోలీసుల నిఘాలో భాగంగా మంగళవారం మండలంలో కోడిపందేలకు కత్తులు సిద్ధం చేస్తున్న ఒక వ్యక్తిని ఎస్సై జయబాబు అరెస్ట్ చేశారు. కత్తులు తయారు చేసేందుకు ఉపయోగిస్తున్న మోటార్ సామగ్రితో పాటు 30 కోడికత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ముసుగులో కోడి పందేలు ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తెగిపడిన విద్యుత్ తీగలు

జంగాడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలో మెయిన్ లైన్ విద్యుత్ వైర్లు మంగళవారం తెగిపడ్డాయి. లైన్లను పునరుద్ధరించే చర్యలు చేపట్టినట్లు ఏపీఈపీడీసీఎల్ ఏఈ జోషఫ్ తెలిపారు.